# హోండా సిటీ స్పోర్ట్ ఎడిషన్

**ధర రూ.14.88 లక్షలు**




న్యూఢిల్లీ, జూన్ 20: దేశవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన హోండా సిటీ మాడల్ సరికొత్తగా స్పోర్ట్ ఎడిషన్‌గా అందుబాటులోకి వచ్చింది. మధ్యస్థాయి సెడాన్ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి హోండా కార్స్ ఇండియా ఈ నూతన మాడల్‌ను ప్రవేశపెట్టింది. ఈ కారు ధర రూ.14.88 లక్షలు(ఢిల్లీ షోరూంలో)గా నిర్ణయించింది. నూతన డ్రైవింగ్ అనుభవం కోరుకుంటున్న యువతను దృష్టిలో పెట్టుకొని ఈ నయా మాడల్‌ను తీర్చిదిద్దినట్టు, 121 పీఎస్‌ల శక్తినివ్వనున్న ఈ కారు లీటర్ పెట్రోల్‌కు 18.4 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. ప్రీమియం క్యాబిన్ పెట్రోల్ సీవీటీ వెర్షన్, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్ వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ కునాల్ బెహ్లా మాట్లాడుతూ..యువత కోరుకుంటున్న విధంగా ఈ నయా సిటీ స్పోర్ట్ వెర్షన్‌ను తయారు చేసినట్టు చెప్పారు.

# లక్ష దిగువకు బంగారం

**రూ.600 తగ్గిన తులం ధర**

న్యూఢిల్లీ, జూన్ 20: బంగారం ధరలు దిగొస్తున్నాయి. ఇరాన్-ఇజ్రాయిల్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను వెనక్కి తీసుకోవడంతో అతి విలువైన లోహాల ధరలు భారీగా తగ్గాయి. పదిగ్రాముల బంగారం ధర లక్ష రూపాయల కిందకు పడిపోయింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో తులం పుత్తడి ధర రూ.600 దిగొచ్చి రూ.99,960గా నమోదైంది. ధరలు తగ్గకముందు బంగారం ధర రూ.1,00,560గా ఉన్నది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.550 తగ్గి రూ.99,250గా నమోదైంది. పుత్తడితో పాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. ఈవారంలో రికార్డు స్థాయికి చేరుకున్న కిలో వెండి ధర రూ.2,000 తగ్గి రూ.1,05,200గా నమోదైంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ పడిపోవడం ధరలు తగ్గడానికి కారణమని బులియన్ వర్గాలు వెల్లడించాయి.

# కీలక రంగాలు కుదేలు

**మేలో 0.7 శాతానికి వృద్ధిరేటు పరిమితం**

- గడిచిన 9 నెలల్లో ఇదే కనిష్ఠం
- ఏడాది క్రిందట 6.9 శాతంగా నమోదు
- చమురు, గ్యాస్, ఎరువులు, విద్యుదుత్పత్తి పేలవం

న్యూఢిల్లీ, జూన్ 20: దేశంలోని కీలక రంగాలు కుదేలయ్యాయి. గత నెలలో గడిచిన 9 నెలల్లోనే కనిష్ఠానికి వృద్ధిరేటు పడిపోయింది. ఈ ఏడాది మే నెలలో కేవలం 0.7 శాతంగానే ఉన్నట్టు శుక్రవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన అధికారిక గణాంకాల్లో తేలింది. గత ఏడాది ఆగస్టులో మైనస్ 1.5 శాతంగా ప్రధాన మౌలిక రంగాల వృద్ధిరేటు నమోదవగా, ఆ తర్వాత ఇప్పుడే అంత దారుణంగా కీలక పరిశ్రమల పనితీరు కనిపించింది. ఇక నిరుడు మే నెలలో 6.9 శాతంగా కీలక రంగాల ఉత్పత్తిలో వృద్ధిరేటు ఉండగా.. ఈ ఏడాది ఏప్రిల్‌లో 1 శాతంగా ఉన్నది. అంతకుముందు ఫిబ్రవరి, మార్చి నెలల్లో వరుసగా 3.4 శాతం, 4.5 శాతంగా గణాంకాలు నమోదయ్యాయి.




**ఇదీ సంగతి..**

ఎనిమిది కీలక రంగాల్లో నాలుగింటి పరిస్థితి అధ్వానంగా ఉన్నది. ముడి చమురు, సహజ వాయువు, ఎరువులు, విద్యుత్తు రంగాల్లో ఉత్పాదకత నిరాశపర్చింది. దీంతో సిమెంట్, ఉక్కు, బొగ్గు, రిఫైనరీ రంగాల్లో ఉత్పాదకత పెరిగినా ఓవరాల్‌గా కోర్ ఇండస్ట్రీ ఇండెక్స్ నిలబడలేకపోయింది. దేశీయ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఈ ఎనిమిది రంగాల వాటానే 40.27 శాతంగా ఉంటున్నది. ఈ నేపథ్యంలో దేశ జీడీపీ నేలచూపులు చూస్తున్న ప్రస్తుత తరుణంలో కీలక రంగాల పనితీరు అంతంతమాత్రంగానే ఉంటుండటం.. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) ఆర్థిక వృద్ధిరేటుపైనా అనుమానాలను రేకెత్తిస్తున్నది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో (ఏప్రిల్-మే) కీలక రంగాల వృద్ధిరేటు 0.8 శాతంగా ఉన్నది. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల్లో 6.9 శాతంగా నమోదైంది.

**ఐఐపీ డౌన్**

కీలక రంగాల ఉత్పాదక సూచీ గత నెలలో తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఐఐపీ గణాంకాలూ ఈసారి నిరాశాజనకంగానే ఉంటాయని దేశీయ ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేస్తున్నది. ఈ క్రమంలోనే మే నెలలో ఐఐపీ గణాంకాలు 1.5 శాతం నుంచి 2.5 శాతంగా ఉండొచ్చని పేర్కొన్నది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఐఐపీ 2.7 శాతంగా నమోదైంది. మార్చితో పోల్చితే 1.2 శాతం తగ్గింది. నాడు 3.9 శాతంగా ఉన్నది.

**మే నెలలో కీలక రంగాల ఉత్పత్తి (శాతాల్లో)**

| రంగం | వృద్ధి/క్షీణత |
|---|---|
| ఎరువులు | -/5.9 |
| విద్యుదుత్పత్తి | -/5.8 |
| సహజ వాయువు | -/3.6 |
| ముడి చమురు | -/1.8 |
| సిమెంట్ | 9.2/- |
| ఉక్కు | 6.7/- |
| బొగ్గు | 2.8/- |
| రిఫైనరీ | 1.1/- |

# అంతా సక్రమమే

**దయానిధి మారన్ ఆరోపణల్ని ఖండించిన సన్ టీవీ**

న్యూఢిల్లీ/చెన్నై, జూన్ 20: సన్ గ్రూప్ చైర్మన్, అన్న కళానిధి మారన్‌కు మాజీ కేంద్ర మంత్రి, డీఎంకే ఎంపీ అయిన తమ్ముడు దయానిధి మారన్ లీగల్ నోటీసులిచ్చిన విషయం తెలిసిందే. మరికొందరికీ పంపిన ఈ తాఖీదుల్లో కళానిధి మోసపూరిత విధానాలకు పాల్పడ్డారని, వేల కోట్ల రూపాయల విలువైన లక్షలాది సన్ షేర్లను అన్యాయంగా తనపేరిట బదిలీ చేసుకున్నారని దయానిధి ఆరోపించిన సంగతీ విదితమే. అయితే ఈ ఆరోపణలను శుక్రవారం సన్ టీవీ నెట్‌వర్క్ తోసిపుచ్చింది. అంతా సక్రమంగానే ఉందంటూ స్టాక్ ఎక్స్చేంజీలకు తెలియజేసింది.

# బీఎస్ఎన్ఎల్ 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ సేవలు

న్యూఢిల్లీ, జూన్ 20: ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్..తాజాగా 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ సర్వీసుల విభాగంలోకి అడుగుపెట్టింది. ఇంటింటికి బ్రాడ్‌బాండ్ సర్వీసులు అందించాలనే ఉద్దేశంతో తొలుత హైదరాబాద్‌లో ఫిక్స్‌డ్ వైర్‌లెస్ సర్వీసులను ఆరంభించింది. ఇప్పటికి రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌లు 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ సర్వీసులను అందిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ సేవలు పొందాలంటే రెండింటిలో ఏదో ఒక ప్లాన్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. వీటిలో రూ.999కే 100 మెగాబైట్ పర్ సెకండ్(ఎంబీపీఎస్) ప్లాన్ కాగా,, రూ.1,499కి 300 ఎంబీపీఎస్ ప్లాన్‌ను అందిస్తున్నది.

# హైదరాబాద్‌లో బజ్‌వర్క్ విస్తరణ

హైదరాబాద్, జూన్ 20: బ్రిగేడ్ గ్రూపునకు చెందిన ప్రీమియం ఫ్లెక్సిబుల్, మేనేజ్డ్ వర్క్‌స్పేస్ బ్రాండ్ బజ్‌వర్క్.. హైదరాబాద్‌లో తన వ్యాపారాన్ని మరింత విస్తరించింది. కొత్తగా హైటెక్ సిటీ సమీపంలోని ఔరో అర్బిట్ వద్ద 24 వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఆఫీస్ స్థలాన్ని నెలకొల్పింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఆఫీస్ స్థలాన్ని నిర్వహించాలనే లక్ష్యంగా పెట్టుకున్న అందుకుతగ్గట్టుగా తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది.

# ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలు ఎక్కడ?

- ఏడాది దాటినా అతీగతీలేని కాంప్లెక్స్‌ల నిర్మాణం
- ఎంఎస్ఎంఈలకు జిల్లాకొకటి తెస్తామని ప్రకటన
- ఇంతవరకు ప్రతిపాదనలు కూడా సిద్ధంకాని వైనం
- ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వలేదంటున్న అధికారులు




ఫ్లాటెడ్ ఫ్యాక్టరీల ఊహా చిత్రం

హైదరాబాద్, జూన్ 20 (నమస్తే తెలంగాణ): ఫ్లాటెడ్ ఫ్యాక్టరీల ప్రతిపాదన ఏడాది దాటినా కాగితాలకే పరిమితమైంది. కనీసం వీటికి అవసరమైన ప్రణాళికలు కూడా ఇంకా సిద్ధం కాలేదు. ఓవైపు పరిశ్రమలకు భూముల కేటాయింపు, అనుమతులు నిలిపివేసిన రాష్ట్ర ప్రభుత్వం.. మరోవైపు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లకు ఉద్దేశించిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీల నిర్మాణంపైనా తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. ఎంఎస్ఎంఈల కోసం జిల్లాకొకటి చొప్పున ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలు నిర్మిస్తామని గత ఏడాది బడ్జెట్ సందర్భంగా రేవంత్ సర్కారు ప్రకటించింది. అవసరమైతే ప్రైవేటు భాగస్వామ్యంతో వీటిని ఏర్పాటు చేస్తామని తెలిపింది. చిన్నతరహా యూనిట్లు ఏర్పాటు చేసుకునేవారు పరిశ్రమకు అవసరమయ్యే భూమి కోసమే అధికంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తున్నందున ప్రభుత్వమే భారీ బహుళ అంతస్తుల కాంప్లెక్స్‌లు నిర్మించి వాటికి కేటాయిస్తుందని చెప్పారు. అయితే ఏడాది దాటినా వీటికి సంబంధించిన ప్రణాళికల్ని ఇంకా పరిశ్రమల శాఖ సిద్ధం చేయట్లేదు. అటు ప్రభుత్వం కూడా కేవలం బడ్జెట్ సందర్భంగా ప్రకటించి మర్చిపోయిందే తప్ప.. ఆ తర్వాత దాని ప్రస్తావనను కూడా తీసుకురావడం లేదు. దీనిపై పరిశ్రమలు, టీజీఐఐసీ అధికారులను వివరణ కోరగా, ప్రభుత్వం నుంచి తమకు అటువంటి ఆదేశాలు ఏవీ రాలేదని, వస్తే ప్రతిపాదనలు రూపొందిస్తామని చెప్తుండటం గమనార్హం.

**యువ వికాసంతో సరిపెట్టే యోచన..**

చిన్నతరహా యూనిట్లు స్థాపించాలనుకునే వారి కోసం ప్రభుత్వం కొత్తగా యువ వికాసం పేరుతో ఓ పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దాదాపు రూ.5 లక్షలదాకా బ్యాంకు రుణంతో యూనిట్లు ఏర్పాటుచేసుకునేవారికి 60శాతం వరకు సబ్సిడీ ఇచ్చేందుకు ఉద్దేశించిన ఈ పథకాన్ని.. పరిశ్రమల శాఖ పథకాలకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం అమలు చేస్తున్నట్టు పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. వాస్తవానికి టీ-ఐడియా, టీ-ప్రైడ్ వంటి పథకాల ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కో యూనిట్‌పై గరిష్ఠంగా కోటి రూపాయలదాకా సబ్సిడీలు అందించింది. ఈ క్రమంలో ఆ పథకాలను యువ వికాసంతో మరిపించాలని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నానా తంటాలు పడుతున్నది. మరి ఇది ఎంతవరకు సఫలీకృతమవుతుందో చూడాల్సిందే.

**ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలు ఇలా**

ఒక బహుళ అంతస్తుల భవన సముదాయంలో వేర్వేరుగా వివిధ తయారీ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడమే ఫ్లాటెడ్ ఫ్యాక్టరీలు. ఉత్పత్తి, అసెంబ్లింగ్, స్టోరేజ్ తదితర కార్యకలాపాలు ఇందులో చేసుకోవచ్చు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఎంఎస్ఎంఈల కోసం రెడీ టూ యూజ్ పద్ధతి. మనకు కావాల్సిన విస్తీర్ణంలో స్పేస్‌ను ప్రభుత్వం వద్ద లీజుకు తీసుకునే వీలుంటుంది. దీనివల్ల ఒకేసారి భూమి కొనుగోలు, భవన నిర్మాణం, విద్యుత్తుసహా ఇతర మౌలిక సదుపాయాల కోసం భారీగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు.

# మళ్లీ 82 వేలపైకి సెన్సెక్స్

**వెయ్యి పాయింట్లకుపైగా లాభపడిన సూచీ**



ముంబై, జూన్ 20: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు విరామం పడింది. గడిచిన మూడు రోజులుగా నష్టపోయిన సూచీలకు ఆర్థిక, టెలికాం, టెక్నాలజీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో తిరిగి కోలుకున్నాయి. ఇరాన్-ఇజ్రాయిల్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో గడిచిన కొన్ని రోజులుగా భారీగా పెరిగిన క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం కూడా సూచీలు పుంజుకోవడానికి పరోక్షంగా దోహదపడ్డాయి. వీటికితోడు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులు కుమ్మరించడంతో వారాంతం ట్రేడింగ్‌లో ఇరు సూచీలు ఒక్క శాతానికి పైగా ఎగబాకాయి. ఇంట్రాడేలో 1,100 పాయింట్లకు పైగా ఎగబాకిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 82 వేల పాయింట్ల మైలురాయిని మళ్లీ అధిగమించింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 1,046.30 పాయింట్లు లేదా 1.29 శాతం లాభపడి 82,408.17 వద్ద స్థిరపడింది.

**25 వేల పాయింట్ల పైకి నిఫ్టీ**

నిఫ్టీ మరో మైలురాయిని అధిగమించింది. కొనుగోళ్ల ఉత్సాహంతో ఎన్ఎస్ఈ నిఫ్టీ 319.15 పాయింట్లు లేదా 1.29 శాతం అందుకొని 25,112.40 వద్ద నిలిచింది. మొత్తంమీద ఈ వారంలో సెన్సెక్స్ 1,289.57 పాయింట్లు లేదా 1.58 శాతం, నిఫ్టీ 393.8 పాయింట్లు లేదా 1.59 శాతం చొప్పున అధికమయ్యాయి.

- ఎయిర్‌టెల్, నెస్లె, మహీంద్రా, పవర్‌గ్రిడ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ, ఎటర్నల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి బ్లూచిప్ సంస్థల షేర్లు లాభాల్లో ముగిశాయి.
- దీంతోపాటు కెనరా బ్యాంక్ షేరు ధర 2.24 శాతం, ఫెడరల్ బ్యాంక్ 1.89 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.60 శాతం, యెస్ బ్యాంక్ 1.59 శాతం, ఎస్బీఐ 1.44 శాతం, కొటక్ బ్యాంక్ 1.13 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.13 శాతం, బ్యాంక్ ఆఫ్ బరోడా 1.12 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లు కూడా పెరిగాయి.

# రజనీకాంత్ కొత్త చిత్రం?



**ఓ సినిమా** సెట్స్‌పై ఉండగానే మరో సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేస్తున్నారు సూపర్‌స్టార్. ఇటీవలే ఆయన లోకేష్ కనకరాజ్ డైరెక్షన్‌లో 'కూలీ' పూర్తి చేశారు. ప్రస్తుతం 'జైలర్-2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తయ్యేలోపే కొత్త చిత్రానికి రంగం సిద్ధచేసే పనిలో ఉన్నారు తలైవా. తాజా సమాచారం ప్రకారం హెచ్.వినోద్ దర్శకత్వంలో రజనీకాంత్ ఓ సినిమాకు అంగీకరించారని తెలిసింది. ప్రస్తుతం ఈ దర్శకుడు దళపతి విజయ్‌తో 'జననాయగన్' చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఇది పూర్తయ్యాక రజనీకాంత్‌తో ఆయన సినిమా ఉంటుందట. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయని, ఈ ప్రాజెక్ట్ దాదాపు ఖరారైనట్లేనని చెన్నై సినీ వర్గాల టాక్. అదే సమయంలో ధనుష్‌తో కూడా హెచ్.వినోద్ ఓ సినిమా ప్రయత్నాల్లో ఉన్నారని వార్తలొస్తున్నాయి. మరి ఇద్దరు స్టార్స్‌లో ఎవరితో సినిమా చేస్తారనే విషయంలో మరికొద్ది రోజుల్లో స్పష్టత వస్తుందంటున్నారు.

**చిత్రం**

# ఇక యుద్ధానికి సిద్ధం



**బాలీవుడ్** స్టార్ హృతిక్ రోషన్‌తో కలిసి ఎన్టీఆర్ నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ 'వార్ 2'. యష్‌రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్ ఫ్రాంచైజీలో భాగంగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్ట్ 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన విశేషాలను దర్శకుడు అయాన్ ముఖర్జీ వెల్లడించారు. 'ప్రపంచవ్యాప్తంగా ఎందరో ఇష్టపడ్డ 'వార్' చిత్రానికి కొనసాగింపుగా 'వార్ 2' చేయడాన్ని బాధ్యతగా భావిస్తున్నా. 'వార్' సినిమాకు సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. వారితో పాటు హృతిక్, తారక్‌లకు కూడా అశేషమైన అభిమానులున్నారు. నిజంగా చెప్పాలంటే ఓ దర్శకుడికి ఇదో పెద్ద ఛాలెంజ్. ప్రేక్షకులకు ఓ గొప్ప థియేటర్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా 'వార్ 2'ను రూపొందించాం. ఎన్టీఆర్, హృతిక్ పాత్రల మధ్య ఉండే సంఘర్షణ అందరికీ కనెక్ట్ అవుతుంది. అభిమానుల అంచనాలు మించేలా, వారికి లైఫ్‌టైమ్ ఎక్స్‌పీరియన్స్‌లా ఈ సినిమా ఉంటుంది' అని తెలిపారు.

# 'డీడీఎల్' ఇప్పుడు ఆడకపోవచ్చు!



**హృదయాన్ని** కదిలించే ప్రేమకథా చిత్రాల రూపకల్పన ఇప్పుడు బాగా తగ్గిపోయిందని, అందుకు కాలానుగుణంగా వచ్చిన మార్పులే కారణమని అన్నారు సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్. ప్రేక్షకులు స్వచ్ఛమైన రొమాంటిక్ స్టోరీని ఆస్వాదించి చాలా కాలమైందని వ్యాఖ్యానించారు. ఆయన నటించిన తాజా చిత్రం 'మెట్రో..ఇన్ డినో' త్వరలో విడుదలకానుంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సమకాలీన సినిమాపై ఆయన ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. 'ఒకప్పుడు ప్రేమలో పడటం, దానిని వ్యక్తం చేయడం ఓ అందమైన అనుభవంలా అనిపించేది. కానీ ఇప్పుడలా కాదు. ప్రేమలో పడిపోవడం, ఆ తర్వాత కొద్దిరోజులకే శారీరకంగా దగ్గరకావడం, ఆపై వెంటనే పెళ్లాడటం.. ఈ ప్రక్రియ చకచకా జరిగిపోతున్నది. దీనిని నేను తప్పనను. ఎందుకంటే నేటి సమాజాన్నే సినిమాలు ప్రతిబింబిస్తున్నాయి' అని అనుపమ్‌ఖేర్ చెప్పుకొచ్చారు. క్లాసిక్ లవ్‌స్టోరీగా నిలిచిన షారుఖ్‌ఖాన్ 'దిల్‌వాలే దుల్హనియా లేజాయేంగే' చిత్రాన్ని ఈరోజుల్లో తీసివుంటే పెద్ద ఫ్లాప్‌గా నిలిచేదని, అప్పటి తరానికి అదొక కొత్త కథ అని అనుపమ్ ఖేర్ అభిప్రాయపడ్డారు. అయితే తరానికి అనుగుణంగా ప్రేమ భావనల్లో మార్పులు రావడం సహజమని, వాటిని అంగీకరించాల్సిందేనని ఆయన పేర్కొన్నారు.

# సూర్య 'కరుప్పు'



**సరైన విజయం** కోసం ఎదురుచూస్తున్నారు తమిళ స్టార్ హీరో సూర్య. అందుకోసం కథల ఎంపిక విషయంలో జాగ్రత్తగా ముందుకెళ్తున్నారు సూర్య. తెలుగు డైరెక్టర్ వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్య హీరోగా సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్న చిత్రం ఇటీవలే సెట్స్ మీదకు వెళ్లింది. దీనికంటే ముందుగా ఆయన 'కరుప్పు' అనే సినిమా చేస్తున్నారు. ప్యాచ్‌వర్క్ మినహా ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందుతున్న ఈ సినిమాకు తమిళ కమెడియన్ ఆర్జే బాలాజీ దర్శకుడు. ఆర్జే బాలాజీ పుట్టిన రోజు సందర్భంగా అతనికి శుభాకాంక్షలు తెలియజేస్తూ టైటిల్ పోస్టర్‌ని మేకర్స్ శుక్రవారం విడుదల చేశారు. అమ్మవారి నేపథ్యంలో కత్తి పట్టి ఫెరోషియస్ లుక్‌లో ఉన్న సూర్యను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. సూర్య 45వ చిత్రంగా ఈ సినిమా రూపొందుతున్నది. త్రిష కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాయి అభ్యంకర్, నిర్మాతలు: ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు, నిర్మాణం: డ్రీమ్ వారియర్ పిక్చర్స్

# దెయ్యాలను నేను పెళ్లాడను

**తెలుగులో** రెండుమూడేళ్ల క్రితమే ఆఫర్లు వచ్చినా.. సాలిడ్ ఎంట్రీ కోసం ఇన్నాళ్లూ ఆలస్యం చేస్తూ వచ్చింది మలయాళమందారం మాళవిక మోహనన్. ఎట్టకేలకు ప్రభాస్ హీరోగా రూపొందుతున్న 'ది రాజాసాబ్' చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వనున్నది ఈ అందాలభామ. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్న ఈ చిత్రం ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల కానుంది. ఇదిలావుంటే.. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే మాళవిక మోహనన్.. తన అందమైన ఫొటోలను ఎప్పటికప్పుడు తన ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ ఉంటుంది. ఆ ఫొటోలను చూసిన అభిమానులు రొమాంటిగ్గా స్పందిస్తుంటారు. రీసెంట్‌గా అభిమానులతో తాను జరిపిన ఓ చిట్‌చాట్‌లో మాళవికను ఓ అభిమాని 'నన్ను పెళ్లాడవచ్చుకదా..' అనడిగాడు.. దానికి ఆమె స్పందిస్తూ.. 'నాకు దెయ్యాలంటే భయం.. దెయ్యాలను నేను పెళ్లాడను' అని సమాధానమిచ్చింది. తనలా ఎందుకు స్పందించిందా! అని అందరూ జుట్టు పీక్కున్నారు. తీరా చూస్తే.. ఆ అభిమాని తన అకౌంట్‌కి తన పేరును కాకుండా 'ఘోస్ట్' అని పేరు పెట్టుకున్నాడు. అందుకే 'దెయ్యాలను నేను పెళ్లాడను' అంటూ ఫన్నీగా స్పందించింది మాళవిక మోహనన్. ఇలా అందమైన ఫొటోలను పోస్ట్ చేయడం, ఆ ఫొటోలను చూ సి ఫిదా అయిన అభిమానులు ఆమెకు 'ఐ లవ్యూ' అంటూ కామెంట్లు పెట్టడం ఆ కామెంట్లకు మాళవిక సరదాగా స్పందించడం ఇవన్నీ మామూలే.



# బ్రేకప్ కహానీ..



**తెలుగమ్మాయి అనన్య** నాగళ్ల మంచి నటి మాత్రమే కాదు, మంచి మనసున్న అమ్మాయి కూడా. తన సంపాదనలో ఎంతో కొంత చారిటీలకే ఖర్చు చేస్తూవుంటుంది. మల్లేశం, వకీల్ సాబ్, పొట్టేల్ చిత్రాల ద్వారా టాలీవుడ్‌లో తనకంటూ ఓ గుర్తింపును సాధించింది అనన్య నాగళ్ల. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన తొలి ప్రేమ బ్రేకప్ విశేషాలను అనన్య నాగళ్ల పంచుకున్నది. 'కెరీర్‌లో పొగడ్తలు, తెగడ్తలు సహజం. అన్నింటినీ అలవాటు చేసుకున్నా. కానీ వ్యక్తిగత జీవితంలో ప్రేమ విఫలమైనప్పుడు మాత్రం బాధ భరించలేకపోయా. నేను ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చిన కొంత కాలానికే నాకు బ్రేకప్ అయ్యింది. రెండేళ్ల పాటు మనసులో ముల్లులా ఆ బాధ గుచ్చుకుంటూనే ఉంది. అయితే.. వర్క్‌పై మాత్రం ఆ ప్రభావం పడనిచ్చేదాన్ని కాదు. రాత్రంతా ఏడ్చేదాన్ని. ఉదయాన్నే జిమ్‌కెళ్లిపోయేదాన్ని. షూటింగ్ టైమ్‌లో కారవాన్‌లో ఏడ్చేదాన్ని. షాట్ అవ్వగానే ఏం జరగనట్టు బయటకొచ్చేదాన్ని. ఈ విషయం ఇప్పటి వరకూ ఇంట్లోవాళ్లకు కూడా తెలియదు. స్నేహితులకు మాత్రమే తెలుసు.' అంటూ చెప్పుకొచ్చింది అనన్య నాగళ్ల.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.